క్లుప్తంగా

ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, ఏఈ

మద్దికెర: మద్దికెరలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నామని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ అన్నారు. శుక్రవారం స్థానిక పెనుగొండ ఊరువాకిలి, సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం వద్ద, ఎస్సీ కాలనీలలో స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వం 90 వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్ నిర్మించేందుకు రూ.32 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అనువైన చోట ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి నీటిని సరఫరా చేస్తామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తాన్నారు. పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, తాలూరు వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణ ఉన్నారు.

ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి

మద్దికెర: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని, లేకపోతే ప్రభుత్వం అందించే పథకాలు వర్తించవని మండల వ్యవసాయాధికారి రవి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పంట నష్టపరిహారం నివేదికలు తయారుచేసి జిల్లా అధికారులకు పంపడం జరిగిందన్నారు. రబీలో పప్పుశనగ, కంది పంటలలో యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను సంరక్షించుకోవాలని సూచించారు. ఏఈఓ భోజరాజు, వీఏఏలు జాకీర్, ఆనంద్, రాణి పాల్గొన్నారు.

క్రీడల్లో మెరిక



బంగారు పతకంతో ఉప్పర శివాని

మద్దికెర: మండల కేంద్రానికి చెందిన ఉప్పర శివాని థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ పారాలింపిక్స్ జావెలిన్‌త్రో, షాట్‌పుట్ క్రీడల్లో రాణించి రెండు బంగారు పతకాలు సాధించినట్లు తల్లిదండ్రులు శుక్రవారం తెలిపారు. ఎమ్మిగనూరు బనవాసిలోని నవోదయ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శివాని గత నెలలో గుజరాత్‌లో జరిగిన జూనియర్ పారా అథ్లెటిక్స్ విభాగం ఎఫ్–46లో రాణించి బంగారు పతకాలు సాధించింది. కుడిచేయి లేకున్నా ఆటల్లో రాణించి అందరి చేత శభాష్ అనిపించుకుంటోంది.


సమగ్ర సర్వేతో భూవివాదాల పరిష్కారం



మాట్లాడుతున్న ఆర్డీఓ రామలక్ష్మి

హాలహర్వి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేతో వివాదాలు పరిష్కారమవుతాయని పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మండలంలోని బిలేహాల్ గ్రామంలో భూముల రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వంద సంవత్సరాల క్రితం భూసర్వే జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర సర్వే చేపట్టిందన్నారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ మల్లికార్జున, వీఆర్వోలు వెంట ఉన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలని తీర్మానం



మాట్లాడుతున్న భీమప్ప

హాలహర్వి: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని వ్యవసాయ సలహా కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మేరకు శుక్రవారం ఏఓ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ భీమప్ప అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. డిసెంబర్ 25వ తేదీ వరకే హెచ్‌ఎల్‌సీకి తుంగభద్ర నీరు వస్తుందని, దీంతో మిరప పంటలకు నష్టం వాటిల్లుతుందన్నారు. మిరప రైతులకు కూడా పంట నష్టపరిహారం ఇవ్వాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మన్నపాల్గొన్నారు.

డీఎల్‌డీఓ ఆకస్మిక తనిఖీ

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు గ్రామ సచివాలయాన్ని శుక్రవారం డీఎల్‌డీఓ నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈఓపీఆర్డీ బాలన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే జనరంజక పాలన





బిణిగేరిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ పెద్దయ్య, మాచాపురంలో ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గోనెగండ్ల: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి, సర్పంచ్ భీమక్క పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలో నెరుడుప్పల గ్రామ సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి తోటయ్య ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల బోర్డును అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించారు. నాయకులు రాఘవేంద్ర రెడ్డి, హరిశ్చంద్ర రెడ్డి, లక్ష్మన్న, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామ సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఎంపీడీఓ రాణెమ్మ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ.4.70 కోట్లు లబ్ధిదారులకు అందించామన్నారు. మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నరెడ్డి, సోమ్మన్న, వెంకటేష్, భీమన్న, వీరభద్రి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను మండల కన్వీనర్ పెద్దయ్య ఆవిష్కరించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని రామళ్లకోట గ్రామ సచివాలయంలో శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. సర్పంచ్ నిర్మల, మండల కో–ఆప్షన్ మెంబర్ మాలిక్‌బాష, సెక్రటరీ, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని పొట్లపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎంపీడీఓ గౌరీదేవి, జేసీఎస్ మండల కన్వీనర్ రాజారెడ్డి, ఉమ్మంబా, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్నే కావాలని రాష్ట్ర ప్రజలందరూ కోరుకుంటున్నారని సర్పంచ్ తెలుగు వాణిశ్రీ, ఎంపీటీసీ బేతాపల్లె రాజేశ్వరి అన్నారు. మండల పరిధిలోని పోతుగల్లు గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను కళ్లారా చూసి జగనన్న మేనిఫెస్టో తయారు చేసి ముఖ్యమంత్రి అయ్యాక వంద శాతం అమలు చేశారన్నారు. 2014లో చంద్రబాబు 600 హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలు నిలువునా మోసగించారని మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో మళ్లీ మోసపూరిత హామీలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని వారి మాటలు నమ్మవద్దని, మరోమారు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. నాయకులు వెంకటరాముడు, వెంకటేష్, మద్దిలేటి, సుధాకర్, వెంకటేష్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నందవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మాచాపురం గ్రామంలో సర్పంచ్ పల్లదొడ్డి కిష్టప్ప ఆధ్వర్యంలో గ్రామ ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ప్రగతి బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి బటన్ నొక్కి విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, ప్రగతి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ చాంద్‌బాషా, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కోటేశ్వరరావు, సత్యన్న, గాలెన్న, శివ, ఎంపటీసీ, వైస్ ఎంపీపీ–2 అగ్నేశమ్మ, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



రామళ్లకోటలో సంక్షేమ బోర్డు ఆవిష్కరణలో సర్పంచ్, కోఆప్షన్ మెంబర్ మాలిక్‌బాష



పొట్లపాడులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పోతుగల్లులో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నెరుడుప్పలలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు

రసాయనాల పిచికారీపై అవగాహన



రక్షణ కిట్ ధరించి పిచికారీ చేయడంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని రామళ్లకోట గ్రామంలో శుక్రవారం రైతులకు క్షేత్రస్థాయిలో రసాయన మందుల పిచికారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్, ఏఓ అక్బర్‌బాష, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పొలానికి మందులు పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మోతాదుకు మించి, విచక్షణా రహితంగా మందులు చల్లడం వల్ల నష్టం తప్పదన్నారు. గాలి దిశ, సమయం, వాతావరణ పరిస్థితులను బట్టి, మొక్క ఆరోగ్యం, ఆశించిన పురుగు, తెగులు తదితర పూర్తి అవగాహనతో వ్యవసాయాధికారుల సూచనల మేరకు పురుగు మందులు వాడాలని సూచించారు. 50 మంది రైతులకు సింజెంట పురుగు మందు కంపెనీ ఉచితంగా అందించిన సేఫ్టీ కిట్‌లను పంపిణీ చేశారు. కంపెనీ ప్రతినిధి వాసుదేవరెడ్డి, ఆర్బీకే ఇన్‌చార్జ్ సాంబశివుడు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ కార్డుల పంపిణీ



టి.గోకులపాడులో ఆయుష్మాన్ కార్డులను అందిస్తున్న డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య తదితరులు

కృష్ణగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య అన్నారు. మండల పరిధిలోని టి.గోకులపాడు, తొగర్చేడు గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలన్నారు. అనంతరం ఆయుష్మాన్‌భవ హెల్త్ కార్డులను అందజేశారు. గ్రామస్తులకు 104 వాహనం నిర్వాహకులు బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీడీఓ రామస్వామి, పశు వైద్యాధికారి నవీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి, బీజేపీ నాయకులు రంజిత్ కర్ని, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి కోగిలతోట హనుమంతరెడ్డి సీసీ కెమెరాలను విరాళంగా అందించగా వాటిని హెచ్‌ఎం నజీర్ అహమ్మద్ పాఠశాలలో ఏర్పాటు చేయించారు. ఇటీవల పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు రూ.1.56 లక్ష విలువ చేసే డిజిటల్ టీవీతో పాటు ఇతర వస్తువులను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. అలాగే పాఠశాల ఆవరణలో కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో హెచ్‌ఎం హొళగుందలోని కిరాణ మర్చంట్ షాలీ సబ్బీర్‌ను ఆశ్రయించారు. ఆయన అమెరికాలోని పెన్సిల్వేనియాలో ఉంటున్న తన స్నేహితుడు, 1996 టెన్త్ క్లాస్‌మెట్ అయిన కోగిలతోట హనుమంతరెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. హనుమంతరెడ్డి స్పందిస్తూ రూ.20 వేలు విలువ చేసే సీసీ కెమెరాలను విరాళం అందించారు. ఆయనకు హెచ్‌ఎంతో పాటు టీచర్లు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలంటూ రాస్తారోకో

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోమప్ప నగర్‌లో ఇటీవల హెచ్‌టీ లైన్ తీగ తెగిపోయి కాలనీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే సరఫరా పునరుద్ధరించాలంటూ కాలనీవాసులు శుక్రవారం పట్టణంలోని 167 హైవేపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. హెచ్‌టీ లైన్ మార్చేందుకు సమయం పడుతుండటంతో ప్రస్తుతానికి విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు పూనుకున్నారు. హెచ్‌టీ లైన్ మార్చిన తరువాతే కాలనీలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కొందరు, మొదట విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మరికొందరు అధికారులతో వాగ్వాదానికి దిగారు. పట్టణ సీఐ మధుసుదన్‌రావు, ఎస్ఐ మస్తాన్‌వలి, ఇన్‌చార్జ్ ఏడీ, ఏఈలు శాంతిస్వరూప్, గోవిందు వారికి నచ్చజెప్పి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ఎస్టీయూ నూతన కమిటీ ఎన్నిక

ఆస్పరి: ఆస్పరిలో శుక్రవారం ఎస్టీయూ మండల నూతన కమిటీని జిల్లా కౌన్సిలర్ శ్రీనివాసులు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రామాంజిని, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, ఆర్థిక కార్యదర్శిగా నాగరాజుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రప్ప, జిల్లా కౌన్సిలర్ పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దస్తగిరి స్వామి గంధోత్సవం

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరిలో వెలసిన దస్తగిరిస్వామి ఉరుసులో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున గంధం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిమ్మనచెర్ల విజయభాస్కర రెడ్డి ఇంటి నుంచి ముజావర్లు గంధాన్ని మేళతాళాలతో దర్గాకు తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామస్తులు దర్గాను సందర్శించి చక్కెర చదివింపులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దర్గా నిర్వాహకులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ బీమా నిరు పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నందవరంలో గుండెపోటుతో దండు ఉరుకుందు(32) హఠాన్మరణం పొందాడు. అతని పేరిట వైఎస్సార్ బీమా నమోదై ఉండడంతో నామినీ దండు సుజాతకు సాయంమంజూరైంది. తక్షణ సాయం కింద సుజాతకు ఈఓపీఆర్డీ చేతుల మీదు గా రూ.10 వేలు, ధ్రువీకరణ పత్రం అందజేశారు. మిగతా సొమ్ము 15 రోజుల్లో నామినీ బ్యాంకు ఖాతాలో జమ వుతుందని వారు తెలిపారు. వార్డు మెంబర్లు లింగమూర్తి, భీమన్న తదితరులు ఉన్నారు.

రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు

హొళగుంద: గజ్జహళ్లి–సిరుగుప్ప క్రాస్ వరకు ఉన్న 6.6 కి.మీ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ రవికాంత్ తెలిపారు. ఆయన శుక్రవారం గజ్జహళ్లి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కెంచప్ప, గ్రామస్తులు సమస్యను ఏఈకి వివరించారు. దాదాపు 6 కి.మీ మేర రోడ్డు మరమ్మతు పనులకు రూ.90 లక్షలతో ప్రతిపాదనలు పంపామని నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టనున్నట్లు ఆయన వారికి చెప్పారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

ఆలూరు రూరల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని మొలగవలి పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆలూరులోని సచివాలయం–4 పరిధిలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో, ఇంట్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచుకోరాదన్నారు. పాత కొబ్బరి చిప్పలు, టైర్లు, పాడైన డ్రమ్ములలో నీరు ఉంచరాదని దీని ద్వారా దోమల లార్వా వృద్ధి చెందుతుందన్నారు. చిన్నారులు, వృద్ధులకు రోజు విడిచి రోజు జర్వం దగ్గ వంటి లక్షణాలుంటే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు.

వెల్దుర్తిలో వికసిత్ భారత్ యాత్ర



గోవర్ధనగిరిలో రైతులకు డ్రోన్ పనితీరును వివరిస్తున్న అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): కేంద్ర సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో చేపట్టిన 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' 3వ నంబరు ఐఈసీ(ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్) వాహనం ద్వారా శుక్రవారం వెల్దుర్తి మండలంలో ప్రారంభమైంది. యాత్ర ఇన్‌చార్జ్‌లు చంద్రమౌళి, గోపాల్ ఆధ్వర్యంలో ఉదయం గోవర్ధనగిరిలో, సాయంత్రం వెల్దుర్తి మండల కేంద్రంలో యాత్ర నిర్వహించారు. కేంద్రం అందిస్తున్న ఉచిత బియ్యం , ఆయుష్మాన్ హెల్త్ కార్డు, మాతృ వందన స్కీమ్, గరీబ్ కళ్యాన్, అంత్యోదయ, ఆవాస్, ఉజ్వల, జన్ ధన్, జీవన్‌జ్యోతి బీమా, సురక్ష బీమా, పెన్షన్ యోజన, ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్, విశ్వకర్మ, కిసాన్ సమన్, క్రెడిట్‌కార్డు, జల్ జీవన్ మిషన్, ప్రణమ్, నానో ఫర్టిలైజర్ పథకాలపై అవగాహన కల్పించారు. పలువురికి హెల్త్ కార్డులు అందించారు. గోవర్ధనగిరిలో రైతులకు డ్రోన్ ఉపయోగాలు, పనితీరును వివరించారు. జెడ్పీటీసీ సుంకన్న, ఏఓ అక్బర్‌బాష, ఈఓఆర్డీ నరసింహులు, సర్పంచ్‌లు ఎల్లరాముడు, శైలజ తదితరులు పాల్గొన్నారు. శనివారం రామళ్లకోట, అల్లుగుండులలో యాత్ర కొనసాగనున్నట్లు ఇన్‌చార్జ్‌లు తెలిపారు.

దివ్యాంగుల భవితకు భరోసా



దివ్యాంగ విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ–2 చిరంజీవి రెడ్డి

ఆలూరు రూరల్: దివ్యాంగ విద్యార్థుల భవితకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఆలూరు ఎంఈఓ–2 చిరంజీవి రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో 16 మంది దివ్యాంగ విద్యార్థులకు ట్యాబులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాఠాలు బోధిస్తే వారి మానసిక స్థితి మరింత మెరుగవుతుందన్నారు. దివ్యాంగులకు ఇంటి వద్దనే ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆలూరు, మొలగవల్లి, పెద్దహోతూరు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ట్యాబులు అందించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు దివ్యాంగ విద్యార్థుల ఉన్నతికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్, సుజాత, సహిత ఉపాధ్యాయులు రామదాసు, అరుణ జ్యోతి తదితరులు ఉన్నారు.

మద్దికెర: విభిన్న ప్రతిభావంతులకు డిజిటల్ విద్యా బోధన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ట్యాబ్‌లు మంజూరు చేసిందని, వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6, 7 తరగతులు చదివే దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఉమ, స్పెషల్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు రాజేశ్వరరెడ్డి, మాధవీలత పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం వేడుకలు నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. మండల విద్యాధికారులు సుదర్శన్‌రెడ్డి, రఘునాథ్ పాల్గొని వినికిడి, కంటి చూపు తక్కువగా ఉన్న 6 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. సహిత ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, ప్రశాంత్, సీఆర్పీ ఉరుకుందు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు



హొళగుంద ఎస్ఎస్ ట్యాంక్ కట్టకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

హొళగుంద: మండల కేంద్రంతో పాటు 11 గ్రామాలకు తాగునీరు అందించేందుకు కడ్లమాగి వద్ద నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కట్ట కుంగడంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ నెల 6న ట్యాంక్ పడమర గట్టు దాదాపు 20 మీటర్ల మేర కుంగిపోయిన సంగతి తెలిసిందే. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే స్పందించి గట్టు మరింత దెబ్బతిని గండి పడకుండా తగిన చర్యలు చేపట్టారు. డీఈఈ మల్లికార్జున, ఏఈ రామలీల ఆధ్వర్యంలో ట్యాంక్ నిర్వహణ కాంట్రాక్ట్ పొందిన సుంకన్న కుంగిన గట్టుకు మరమ్మతు పనులు చేపట్టారు. పొక్లెయిన్‌తో పాటు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి గుంతను పూడ్చి పనులు చేపట్టారు. 2016 లో ఎస్ఎస్ ట్యాంక్‌కు రూ.10 కోట్లతో ట్యాంకును నిర్మించారు. ఆ సమయంలో చేపట్టిన పనుల్లో నాణ్యత కొరవడిందో ఏమో తెలియదు గానీ మూడు రోజుల క్రితం ఉన్నట్టుండి గట్టు కుంగిపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో అధికారులు మరమ్మతు పనులు చేపట్టగా పనులు పూర్తయ్యేందుకు మరి కొద్ది రోజులు పట్టనుంది. ప్రస్తుతం మరమ్మతు పనులు చేపడుతున్నామని, గట్టు కుంగడానికి గల కారణాలు తెలుసుకుని భవిష్యత్తులో ఎలాంటి నష్టం జరగకుండా శాశ్వత పనులు చేపడ్తామని డీఈఈ తెలిపారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఎస్ఎస్ ట్యాంకులో నీటిని అలాగే నిల్వ ఉంచి మరమ్మతు పనులు కొనసాగిస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



ఎమ్మిగనూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరుటౌన్: అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని 17వ వార్డు పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టీడీపీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీకి అఖండ విజయం అందించాలని కోరారు. వార్డు పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి వసతి, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొంటున్నారని చెప్పారు. నాయకులు రామాంజినిరెడ్డి, రియాజ్‌అహమ్మద్, నజీర్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, షబ్బీర్, వాహిద్, సుధాకర్, సోమేష్, కోటకొండ నరసింహులు, యుయు నాగేష్, గట్టుభాజ తదితరులు పాల్గొన్నారు.

రాజమార్గం



నేడు: ముత్తుకూరులో కొత్తగా వేసిన సీసీ రోడ్డు



నాడు: బురదమయంగా ఉన్న రోడ్డు

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు గ్రామం నుంచి 2 కి.మీ దూరంలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు కొత్తగా సిమెంట్ రోడ్డు వేయడంతో ఎద్దుల బండ్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు సౌకర్యంగా మారింది. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ముత్తుకూరు గ్రామం నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు ఉన్న రహదారి అధ్వానంగా తయారై వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండేది. రైతులు పొలాలకు వెళ్లేందుకు ఎద్దుల బండ్లు కూడ వెళ్లలేక ఎన్నో అవస్థలు పడేవారు. సమస్యను సర్పంచ్ తోయజాక్షప్ప, గ్రామస్తులు కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన మంత్రి 2 కి.మీ సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.1.80 కోట్లు మంజూరు చేయించారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయించి ఇబ్బందులు తొలగించడంతో మంత్రికి సర్పంచ్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో రాణించాలి

దేవనకొండ: స్థానిక భవిత కేంద్రం ఐఈఆర్‌టీఎస్ శివాంజనేయులు, హైమావతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం కార్యక్రమాన్ని స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ–1 తిమ్మారెడ్డి, ఎంఈఓ–2 విజయనిర్మల హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలని, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం బజారప్ప తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలోని హరిజన, బీసీ కాలనీలో నీటి సమస్య పరిష్కారమయ్యింది. ఆ కాలనీల్లో గత పది సంవత్సరాలుగా ప్రజలు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామ ప్రజలు సమస్యను మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో గ్రామంలో రెండు నీటి బోర్లు వేశారు. ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ సహకారంతో శుక్రవారం బోర్లకు చేతి పంపులు ఏర్పాటు చేయడంతో ఆయా కాలనీలకు నీటి సమస్య పరిష్కారమయ్యింది. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ భీమ, వైస్ సర్పంచ్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.